
# విశాల హృదయం

పద్మినీ చిత్రరంజన్



"అమ్మా! పిల్లాడు గగ్గోలు పెట్టేస్తున్నాడు" చంద్రం రెండు చేతులతో వంటింటి గడప పట్టుకుని లోపలికి వంగి అన్నాడు.

పొయ్యిమీదినించి కూర దింపి చారు గిన్నె ఎక్కిస్తున్న విశాలాక్షమ్మగారికి అదేమంత పెద్ద విషయం అనిపించలేదు "పిల్లలు ఏడవకేం చేస్తార్రా! ఆటాపాటా వచ్చేవరకూ మరి అన్నిటికీ ఏడుపే! కాకపోతే నిద్రా, అంతే" అంది తాపీగా.

తల్లి బయటికివచ్చే సూచన కన్పించ లేదు. చంద్రం మళ్ళీ గదిలోకి పరుగెత్తినంత పనిగా నడిచాడు. పదిహేను రోజుల పసివాడిని అడ్డంగా, నిలువుగా ఎలా ఎత్తుకున్నా సముదాయించటంచేత కావటం లేదు మాలతికి. పిల్లాడు ఏడుస్తున్నాడనే గాభరా వాడిఏడ్పు మాన్పించ లేని చేతకాని తనం— ఈ రెంటితో మాలతి కళ్ళు నిండాయి.

వాడు ఇంకా ఏడుస్తూనే ఉన్నాడు.

"పోనీ పాలుయివ్వరాదూ!" చంద్రంతోచిన సలహా చెప్పేశాడు. "ఇచ్చినా తాగటం లేదండీ" దీనంగా సమాధానం చెప్పింది చంద్రానికైతే వాడిని ఎత్తేసుకుందామన్నంత ఆతృత కలిగింది. కాని పొత్తిళ్లలోని ఆ మెత్తని కసి కందుని నిద్రపోతుండగానే చేతులో నిల్పుకోవటం అతనికి చేతకాలేదు. ఇప్పుడేం చెయ్యగలడతను.

తిరిగి చంద్రం వంటింటిలోకి పరిగెత్తాడు. "అమ్మా! వాడు అసలూరుకోటం లేదమ్మా. నువ్వొక్కసారి రారాదూ!" చంద్రం గొంతులో ఆత్రుత ధ్వనించింది.

అప్పటికి విశాలాక్షమ్మగారు దేముడి దగ్గర దీపం పెట్టింది. ఇక చేసినవంట నైవేద్యం చెయ్యాల్సి ఉంది. కళ్ళు తెరిచి చంద్రాన్ని చూసిందామె. మెత్తగా నవ్వింది కూడా!

"అదేమిట్రా పిచ్చి నాయనా తల్లి దగ్గరుందని వాడు నా దగ్గర ఊరుకుంటాడుట్రా అయినా వాడు ఏడ్చినప్పుడల్లా నేను సముదాయిస్తే మరి దానికెప్పుడు చాతవుతుంది. మేమంతా మొదట కాన్పు పిల్లల్ని పెంచలేదూ. చిన్నప్పుడు నువ్వెంత ఏడ్చే వాడివనీ. నీపోలికేవాడికీని" ఆమాట అంటున్నప్పుడు విశాలాక్షమ్మగారి ముఖంలో ప్రసన్నత చిరులాస్యం చేసింది. "చిన్నాడికి వేళైంది నాయనా! వాడికి అన్నంపెట్టద్దూ? ఇంకా నైవేద్యం కాలేదూ" పోనీ వద్దామన్నా రావడానికి వీలులేక పోవడానికి కారణం చెప్పిందామె. మళ్ళీ ప్రశాంతంగా కళ్ళు మూసుకుని భగవన్నామస్మరణలో పడిపోయింది.

చంద్రానికి చేతనయింది వంటింటికీ పడక గదికీ మధ్య పరుగెత్తటమే. అప్పటికి పసివెధవ పడుకున్నాడు. ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లి పోయాడో, మాలతికి వాడిని సముదాయించగల శక్తివచ్చిందో మాత్రం తెలీదు. ఒడిలోని పసివాడిని చూస్తూ ఉంది మాలతి తదేకంగా. చంద్రం ఆమె పక్కనే వచ్చి కూర్చున్నాడు. అలసిన కళ్ళు, చెదిరిన ముంగురులు, చిరు చెమటలతో తడిసిన నుదురూ మాలతిని చూసే సరికి 'తొలికాన్పు పసిపాప సాకనేర్వనిబాల' చంద్రంమనసులో మెదిలింది.

ఆప్యాయంగా ఆమె ముంగురులు సవరిస్తూ నిద్రపోతున్న కొడుకు ముఖంలో ప్రసన్నతని పరికిస్తూ అలా కూచుండి పోయాడు.

* * *

చంద్రం ఆఫీసు నుంచి వచ్చేసరికి ఆలస్యమైంది. నీరసంగా పిల్లవాడిని పక్కలో వేసుకుని పడుకున్న మాలతిని చూస్తూనే 'ఏం అలా ఉన్నావ్' అని అడిగాడు చంద్రం.

"ఎలా ఉన్నాను?" ఎదురు ప్రశ్న అడిగింది మాలతి.

"చాలా నీరసంగా ఉన్నట్టుంది. ఒంట్లో బాగోలేదా".

'బాగానే ఉంది.' క్లుప్తంగా సమాధానం చెప్పిందామె. అత్తా కోడళ్ళమధ్య విసురుగాలి వీచినప్పుడు మాలతికి మితభాషిత్వం అలవడుతుంది. అందుకే చంద్రం కొంచెం దగ్గరగా వచ్చి మెల్లగా 'ఏం జరిగింది మాలతీ!' అని అడిగాడు.

'ఏం లేదండీ! కొంచెం నీరసంగా ఉంది అంతే'.

మాలతి అంతవరకూ భోజనం చేయలేదనే విషయం విని చంద్రం ఆశ్చర్యపోయాడు. అంతలో తల్లి పిలుపువిని వంటింట్లోకి నడిచాడు.

'అందరూ తినేశారేమిటి' అన్నం కలుపుతూ అడిగాడు చంద్రం. మరి అంతకు మించి ఏం ప్రశ్నించాలో అతనికి తెలీలేదు.

టైము తొమ్మిదయింది. 'మాలతికి ఎందుకన్నం పెట్టలేదింకా' అని అడగటానికి కొంచెం జంకులాంటి మొహమాటం.

"అబ్బే ఎవరూ తినలేదురా. తమ్ముడెటో వెళ్ళాడు. చిన్నాళ్ళిద్దరూ ఆరింటికే తినేశారనుకో. నాన్నగారు సినిమా కెళ్లారు. అందుకని నేను కాస్త నడుం వాల్చాను"

చంద్రానికి కంతగా అన్నం రుచించలేదు. పెద్ద కొడుక్కి ఆప్యాయంగా వడ్డించిన పెరుగు కంచంలో నాలుగు మూలలా పరుచుకుంది.

మాలతి సంగతి అడగటమా మానటమా అనే సందేహంతోనే అతనుచెయ్యి కడుక్కున్నాడు.

అంతలో తండ్రివచ్చాడు. తమ్ముడూ వచ్చాడు.

భోజనం చేసి పమిట కొంగుకుచెయ్యి తుడుచుకుంటూ వచ్చి చంటాడి దగ్గర నడుంవాల్చింది మాలతి.

పైన ఫాను తిరుగుతోంది. వంటింట్లో గిన్నెలు సర్దుతున్న చప్పుడు, ఇల్లు కడుగుతున్న అలికిడి అవుతోంది.

చంద్రం మనస్సులో ఆలోచనలు ముసురు కుంటున్నాయి.

మాలతి ముఖంలో నీరసం, నిస్సహాయత చూసినప్పుడల్లా తను పొరపాటు చేశానా అనే తర్కిస్తున్నాడు చంద్రం.

'తొలిచూలు పురుడు. మా ఇంటికి పంపటం న్యాయం' అంటూ మాలతితల్లిదండ్రులు ఎంతో బలవంతం చేశారు.

'పంపరాదుట్రా! వాళ్లంతగా అడుగుతూంటేనూ? పల్లెటూర్లో మాత్రం ఎంత మంది పురుడోసుకుంటంలేదు' అని తల్లి కూడా వాళ్లనే సమర్థించింది.

"పల్లెటూళ్లో ఎందుకండీ? మావూరికి రెండు మైళ్లలో బస్తీలో ఆసుపత్రి ఉంది అందులో చేర్పిస్తాం. మొదటిసారి గదా ఇంట్లో అంటే మాకూ భయంకాదూ' అంటూ ఆశగా అల్లుడివైపు చూసింది అత్తగారు.

చంద్రం ససేమిరా ఒప్పుకోలేదు. 'అదేం హాస్పిటలండీ? తిన్నగా ఓమందు ఉండదు, మందులషాపుల్లో కూడా సగం మందులు దొరకవు. డాక్టర్లు సరే సరి! సరే అవన్నీ ఎందుకు లెండి. అంతగా అయితే మీరే ఇక్కడికి వస్తే పోలా'

చేసేదేంలేక వెళ్ళిపోయారు వాళ్లు. మాలతికి పురుడు రాగానే వచ్చిస్నానం అయ్యేవరకు ఉండి వెళ్ళింది తల్లి. వాళ్లదీ పెద్ద సంసారం. ఎన్నాళ్లనిఆవిడ ఉండగలదు కూతురు దగ్గర.

మాలతి అప్పుడే నిద్దట్లోకి జారి పోయింది. పసివాడు నిద్దట్లో నవ్వు కుంటున్నాడు.

చంద్రం కొడుకువంక గర్వంగా చూశాడు. అంతలోనే వాడు కెవ్వుమని రాగం అందుకున్నాడు. మాలతి గాభ రాగా లేచి వాడిని వళ్ళోకి తీసుకుంది.

విశాలాక్షమ్మగారు నిద్ర కుపక్రమిం చిన సూచనగా గుర్రు వినబడుతోంది.

చంద్రానికి సావిత్రి గుర్తొచ్చింది. సావిత్రి పురుడు అమ్మ ఎలా పోసింది. పిల్లాడి గొంతు వినబడితే చాలు మడీగిడీ ఒదిలేసి పరుగెత్తుకువచ్చేది తల్లి. చంద్రా నికి బాగా గుర్తున్నది, ఆరోజు చంద్రం రెండో ఆట చూసి వచ్చేసరికి పసివాడిని విశాలాక్షమ్మగారు ఎత్తుకుని తిప్పు తున్నారు.

'అదేమిటమ్మా ? ఎందుకూ వాడిని ఎత్తుకున్నావ్' అన్నాడు చంద్రం.

'వీడూరికే ఏడుస్తున్నాడురా ! పిచ్చి తల్లి సావిత్రికేమో నిద్ర చాలటంలేదు. వీడుట్టి రాలుగాయి చూశావా ! పగలు నిద్ర, రాత్రి జాగారమూనూ !' అంది-

ఆరోజే కాదు - ఏ రోజూ పసివాడిని సముదాయించవలసిన అవసరం సావిత్రికి కలగలేదు.

అవతల చెంబు ఇవతల పెట్టకండా, అబ్బాయిని కనీసం ఎత్తుకు తిప్పకండా ఐదునెలలు చెల్లెలు అనుభవించిన రాజ భోగం చూసినతర్వాత అమ్మమీద బాగా గురి కుదిరింది చంద్రానికి. అందుకనే అన్నివిధాల ఇక్కడే సౌకర్యంగా ఉంటుందని మాలతిని పుట్టింటికి పంప లేదు.

ఇప్పుడావిషయమే మళ్ళీ ఆలోచిస్తు న్నాడు. మాలతి మాత్రం భర్తను వదిలి చాలారోజులు ఉండలేక, పుట్టింటికెళ్ళాలనే కోరిక తప్పించుకోలేక, చివరికి ఎటూ చెప్పలేకపోయింది.

చంటాడు మళ్ళీ ఏడుపు మొద లెట్టాడు.

"ఊరుకో బాబూ. జో జో జో !" మాలతి సతమతమవుతోంది. 'ఇలా యియ్యి మాలతీ నేనెత్తుకుంటాను' చంద్రం లేచాడు. "నాదగ్గిరే ఉండండి మీ దగ్గిరేం ఉంటాడండీ. మెడలైనా నిల వని వాడిని ఎలా యెత్తుకుంటారు" మాలతి పిల్లాడిని ఇవ్వలేదు.

కాని చంద్రం పడుకోలేకపోయాడు.

పొత్తిళ్ళలో పసివాడిని చేతుల్లోనే ఊపుతూ ఉంది మాలతి. ఆమె యెదురుగా నిలబడి 'జోజో' అంటూ చిటికెలు వేస్తూ వాడి ఏడుపు మాన్పించాలనే ప్రయత్నం మొదలెట్టాడు చంద్రం-

విశాలాక్షమ్మగారికి మెలుకువ వచ్చింది 'చంద్రం! ఎందుకురా పిల్లాడేడుస్తున్నాడు' అంటూ గడపదగ్గిరకి వచ్చింది.

'ఏమోనండీ నిద్రలోనించి కెవ్వుమని లేచాడు' మాలతి చెప్పింది సమాధానం.

'ఆ. ఏదో కుట్టిందేమో. కాసేపు అలాగే చేతుల్తో ఊపు. నిద్దరోతాడు. నాల్రోజుల్లో తొట్లో వేశామంటే గొడవుండదు. ఊపెయ్యొచ్చు'అంటూ ఆవిడ కొడుకువైపు చూసింది. 'అవునుగాని నువ్వెందుకురా దాంతోపాటు మేలుకోటం. పగలంతా కష్టపడేవాడివి. ఇలా నిద్దర్లు లేకపోతే ఆరోగ్యం చెడదూ. పసివాళ్ళు ఏడవకేంచేస్తారు. నువ్వు హాల్లో పడుకోమని అందుకే చెప్పాను.

చంద్రం కాస్త విసురుగా అందుకున్నాడు. 'ఏం చెప్పావు. వాడలా ఏడిస్తే నాకు నిద్ర పడుతుందా ? హాల్లో అయినా మెలుకువ వస్తుంది. అయినా నీకెందుగ్గాని వెళ్ళిపడుక్కో. మళ్ళీ తెల్లారగట్టే లేస్తావుగూడా'

చివరి మాటతో విశాలాక్షమ్మ మెత్తబడింది. కొడుక్కి తనమీద ఉన్న అభిమానానికి సంతోషపడి వెళ్ళి పడుకుంది.

చంద్రం పొద్దుటి చిరాకంతా తల్లిమీద చూపించాడని మాలతికి తెలిసింది.

చంద్రం లేచేటప్పటికి కాస్త ఆలస్యమైంది. బ్రష్ నోట్లో పెట్టుకుని దొడ్లోకి నడిచాడు.

మాలతి పసివాడిని కాళ్ళమీద వేసుకుని నూనె రాస్తోంది.

'అదేం నువ్వు పోస్తున్నావ్ నీళ్ళు ?' అడిగాడు.

మాలతి కాస్త కోరగా చూసింది భర్త వైపు 'బాగుంది పిల్లాడికి నీళ్లోయటం నేర్చుకోవద్దా ఏం ? యెన్నాళ్ళని చేస్తారు యెవరు మటుకైనా ! తమపని తాము చేసుకోటం యెప్పుడూ మంచిది '

అంతలోనే వంటింట్లోంచి "నూకాలూ కాస్త పిల్లాడికి పైనీళ్లందుకోవే. ఇవ్వాళ లేవడం ఆలస్యమైంది. వంటకాదని మడి కట్టుకున్నాను' అని విశాలక్షమ్మ గారి కేక విన్పించింది.

'వత్తా వత్తా' అంది గట్టిగా నూకాలు 'ఆఁ. పెట్టేందుకు సిన్నసెయ్యేగాని పని సెప్పేందుకి పెద్దనోరే మాతల్లిది' అని సణుక్కుంటోంది అది నూతిగట్టున.

బ్రష్ పక్కన పడేసి 'నేను పోస్తానుండు పైనీళ్ళు' అంటూ చెంబందుకున్నాడు చంద్రం.

'ఇంకేం నేను వళ్ళురుద్దటానికి మీరు నీళ్ళుపోయడానికి సరిపోయాం' అంది విరుపుగా మాలతి.

"ఏం ఆ మాత్రం చేతగాదను కున్నావా" అంటూ ఆప్యాయంగా చెంబు బాల్చీలో ముంచాడు చంద్రం.

పసివాడిని తుడిచి లోపలికి తెస్తున్న మాలతి వీధివంక చూసి అలాగే నిలబడి పోయింది.

వస్తూనే పిల్లాడిని అందుకుని 'అయ్యో జలుబు చేస్తుందే. నిప్పతే అమ్మా. పొగ వేస్తాను' అంటున్న అత్తగారిని గౌర వంగా పలకరించి లోపలికి నడిచాడు చంద్రం.

ఇరవై ఒకటోరోజున తొట్లో ఊగు తున్న మనవడిని చూస్తూ సందేహిస్తూనే అడిగింది అత్తగారు.

"ఇప్పుడైనా పంపండి అల్లుడుగారూ పిల్లని. మూడోనెల వచ్చేవరకు ఐనా ఉంటుంది మాయింట్లో" అని

ఆమాటే వినాలని యెదురుచూస్తున్న చంద్రం "తప్పకుండాను. మాలతి నీరసంగా ఉందికూడా. మరోనాల్రోజులు ఆలస్యమైనా పర్వాలేదు. అది కోలు కున్నాక పంపుదురుగాని" అన్నాడు బరువు దించుకున్నట్టు.

ఆమాట వింటూ అత్తగారు ఆశ్చర్య పడింది.

విశాలాక్షమ్మగారు తెల్లబోయింది. కాని,

మాలతి మాత్రం తనలో తను నవ్వు కుంది—

రిక్షా ఎక్కబోయేముందు భార్యని లోపలికి పిలిచి అన్నాడు చంద్రం "సారీ మాలతీ! నిన్ను ఇబ్బంది పెట్టాను.అమ్మ సావిత్రి పురుడుపోయటంచూసి మరోలా అనుకున్నా. నామూలాన నువ్వు చాలా ఇబ్బంది పడ్డావు."

మాలతి నవ్వి ఊరుకుంది.

చంద్రం మళ్ళీ సంజాయిషీ చెప్పు కున్నాడు. "నిజం మాలతీ మా అమ్మ చాలామంచిది. నలుగురికి మంచిచేసే మనిషి. మరి నీ దగ్గిరకి వచ్చేసరికి..."

"అది అంతే లెండి. ప్రతి తల్లీ మంచిదే" అంది మధ్యలోనే మాలతి.

"కాదు మాలతీ! మా అమ్మ చాలా విశాల హృదయం గలమనిషి"

"కాదని ఇప్పుడు మాత్రం ఎవ రన్నారు. మీ అమ్మకి విశాల హృదయం ఉంది. ఆ విశాలమైన హృదయం ఆవిడ పిల్లలకి సరిపోయింది. మరి నాబోటి పరాయింటి పిల్ల మూల ఇరకాల్సి వచ్చింది. అందుకే ఇరుకుచోటు గరుకు గోడలు తగులు తున్నాయి. ఆవిడమీకు అమ్మ కాని, మరి నాకు అత్తగారుగా."

"రా అమ్మా టైమవుతోంది" అన్న తల్లి పిలుపుతో మాట ఆపి బైటకి నడి చింది మాలతి.

నిద్రపోతున్న పసివాడిని గుండెల్లో హత్తుకుంటూ రిక్షాలో వెడుతున్న మాలతి మనసులో ఉన్న కాబోయే అత్తగారు మాత్రం ఎలాటిదో తెలీదు.

——